సంయుక్తం

సీరియల్ — పి. వి. కృష్ణమూర్తి

(క్రిందటి సంచిక తరువాయి)

కావేరీ నది దరులను ఒరుసుకుంటూ గంభీరంగా ప్రవహిస్తున్నది. ఆ నది ఒడ్డున ఉన్న విస్తారమైన సైకత ప్రదేశంలో సముద్రగుప్త మహారాజుతో వస్తున్న మగపెళ్ళివారిని ఎదుర్కోవడానికి తగిన ఏర్పాట్లు చేయించాడు గణపతి నాగేంద్రుడు. ఆ ప్రదేశం మధురా నగరానికి సగం అవుడ దూరాన ఉన్నది.

సముద్రగుప్త మహారాజుతో వియ్యమందబోతూ ఉన్న గణపతి నాగేంద్రుని సంతోషమూ, సంబరమూ అంతా అంతా కాదు. తన అంత అదృష్టవంతుడు ప్రపంచంలో మరొకడు ఉండడని అతని భావన.

తన రాజధానీ నగరమైన మధురా నగరంలోని వీధులన్నీ స్వాగత ద్వారాలతో, మకర తోరణాలతో ఎంతో రమణీయంగా అలంకరింపజేశాడు. ముఖ్యంగా పెళ్ళివారు ప్రవేశించే నగర బహిర్ద్వారం నాగేంద్రుని ఉత్తమ కళాభిరుచిని వియ్యోళ్ళు చాటే విధంగా అలంకృతమై ఉన్నది.

పురప్రజలు కూడా తమ తమ గృహాలనూ, భవనాలనూ, భవంతులనూ, ప్రాసాదాలనూ తమ అంతస్తులకు తగిన విధంగా తమ సందర్భంలో అలంకరించుకున్నారు. ప్రజలకు గణపతి నాగేంద్రునిమీద అమితమైన భక్తి. యువరాజు కుబేర నాగ అన్నా అందరికీ అభిమానమే. అందున సముద్రగుప్త మహారాజ కుమారునితో ఆమె వివాహం జరగబోతున్నది. ఈ వివాహం నిశ్చయమైన నాటినుండీ పెళ్ళిరోజు కోసం ఎదురుచూస్తున్న ప్రజ, ఈనాడు పెళ్ళికుమారుని రాక కోసం ఎదురు చూస్తున్నారు.

ఆనాటి వేకువనే శీఘ్రగామి అయిన ప్రతి హారి ఒకడు వచ్చి పెళ్ళివారు మధురా నగరానికి క్రోసెడు దూరంలో ఉన్నారని చెప్పాడు.

అన్ని ఏర్పాట్లూ సర్వసిద్ధంగా ఉండడం చేత గణపతి నాగేంద్రుడు సతీసమేతుడై మంత్రులతో, ఉన్నతాధికారులతో, పుర ప్రముఖులతో, పురోహితునితో, సమస్తరాజోపచార ద్రవ్యాలతో పెళ్ళివారిని ఎదురుకోడానికి ఆచోట సన్నద్ధుడై ఎదురుచూస్తూ ఉన్నాడు.

సరిగ్గా సూర్యోదయ మవుతున్న వేళ పెళ్ళివారు ఆచోట చేరారు.

వెంటనే శంఖ, భేరీ మంగళ ఘోషలు మిన్ను ముట్టినవి. అక్షతలూ, లాజలూ, సుగంధపుష్పాలూ వర్షప్రాయంగా పెళ్ళి వారిమీద విరివిగా వేయబడినవి.

గణపతి నాగేంద్రుడు, అతని భార్య దేవనాగ, మంత్రులు, పురోహితుడు ముందుకు పెళ్ళి వారివద్దకు వెళ్ళారు.

సముద్రగుప్త మహారాజ రథం దిగుతూ ఉంటే గణపతి నాగేంద్రుడు చేయాతనిచ్చాడు.

మగపెళ్ళి వారందరినీ అక్కడ వేసి ఉన్న పందిరిలో సుఖాసీనులను చేసి, పానీయాలూ, ఉపహారాలు ఇచ్చి, కొంతసేపు ప్రయాణపు బడలిక తీర్చుకోవడానికి అనువు కల్పించారు.

అక్కడి ఏర్పాట్లన్నీ చూచి ధ్రువదేవీ ముగ్ధురాలైంది. రాణీ దేవ నాగ ధ్రువదేవిని అంటిపెట్టుకుని ఉన్నది. వింతో మర్యాదగా, మన్ననగా మాటాడుతున్నది.

చంద్రగుప్తుని చూచిన గణపతి నాగేంద్రునికీ, దేవనాగకూ జన్మతరించినట్లయింది. సాక్షాత్తు ఆ కుమార స్వామియే ఈ రూపంలో వచ్చాడా అనిపించింది వారికి. తమ కుబేరనాగకు తన్నివిధాలా తగిన వరుడేనని సంబరపడిపోయారు.

చంద్రగుప్తునికి ఉపచారాలు చేస్తున్న వారిని దేవనాగ పెచ్చరించి ధోరణి చూచి ధ్రువదేవికి అమితమైన నవ్వు వచ్చింది. తన వివాహ సమయంలో తన తలిదండ్రుల ఈ ఆత్రతను తాను చూచే అవకాశం ఉండలేదు. ఇప్పుడు వాళ్ళను చూస్తూ ఉంటే ఆమెకెంతో ముచ్చటగా ఉన్నది. ఎంత చనువుగా వారితో కలిసి పోవాలనే ఆమెకు ఉన్నది కాని, తాను వియ్యపురాలి అంతస్తులో ఉన్నదాయెను.

మరిదికి దగ్గరగా ఉండి మరీ ఉపచారాలు చేయిస్తున్నది.

"మీ ప్రయాణం సుఖంగానే జరిగింది గదా?" అన్నది దేవనాగ ధ్రువదేవితో.

"మా రథాలన్నీ బాగానే సాగినవి కాని, మా మరిదిగారి రథమూ, మనోరథమూ కాస్త వెనక్కులాగి ఇబ్బంది పెట్టినవి" అన్నది గంభీర ధోరణితో ధ్రువదేవి.

"కారణం?" అన్నది దేవనాగ. ఆమె ముఖంలో కలవరపాటునూ, చంద్రగుప్తుని ముఖంలో చిరుకోపాన్నీ చూచి తనలో తాను నవ్వుకున్నది ధ్రువదేవి.

"మరేం లేదు. తాను పెళ్ళాడబోయే కన్యను ముందుగా తనకు చూపించలేదని మరిదిగారికి కోపం" అన్నది ధ్రువదేవి. దేవనాగ ధ్రువదేవి కళ్ళలో మెరిసే చిలిపితనం చూచి ఆమె అంతర్యం గ్రహించింది.

"అలాగా? అయితే ఇప్పుడు గట్టి చిక్కేనే!" అన్నది దేవనాగ, తాను నిజంగానే బెంబేలు పడుతున్నట్టు.

"ఎందుకనీ?" అన్నది ధ్రువదేవి ఆశ్చర్యంగా.

"వివాహానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాము గదా? ఇప్పుడు మీ మాట చెపితే ఎట్లా?"

"మరేం బాధపడ నవసరం లేదు. మీ అమ్మాయి అప్సరసలా ఉంటుందని బాగా నచ్చచెప్పి మరీ తీసుకు వచ్చాను మా మరిదిగారిని."

"మీరు చూడకపోయినా, నిజమే చెప్పారు."

"అలాగా? అయితే, పెళ్ళికూతురు చాలా అందంగా ఉంటుందన్నమాట. పాపం! మా మరిది చాలా అమాయకుడు."

"ఆ విషయమేదో మా అమ్మాయి చూచుకుంటుందిలే లెండి."

చంద్రగుప్తుడు ఇబ్బందిపడిపోతున్నాడు వాళ్ళ ధోరణికి. అయినా, తనేం చేయగలడు మధ్యను? ఈలాంటి వేళల్లో స్త్రీలదే గదా పెత్తనమంతా?

"అయితే, పెళ్ళికూతురు చాలా తెలివైన దన్నమాట! నేను తక్షణం ఆమెను చూచి తీరాలి."

"తక్షణం చూచి తీరాలా? ఇబ్బందేనే!" అన్నది దేవనాగ.

"ఏం?"

"మా ఆచారం, తల్లీ! పెళ్ళికూతుర్ని చేసిన దగ్గరినుండే కన్యాదానం చేసేవరకూ పెళ్ళికూతురు మగపెళ్ళి వారికంటబడకూడదు."

ఈ మాటతో ధ్రువదేవి గతుక్కుమన్నది. అయినా, తాను దొరికిపోయినట్టు ఉండ కూడదని "నాకీ సంగతే తెలియదు. అనవసరంగా మా వంశాచారాన్ని రద్దు చేయించాను" అన్నది.

"ఏమిటో అది?

"కన్యాదానం వేళవరకూ పెళ్ళికొడుకు కన్యాదాతల కంటబడకూడదు. మా వారినీ అలాగే చేశారు. ఈ ఆచారానికి అర్థంలేదని నేనే మామగారితో పోట్లాడినంత పని చేశాను."

దేవనాగ వకాలున వచ్చి ధ్రువదేవిని వాటేసుకున్నది.

"ఎంతా కల్లా కపటంలేని దానవమ్మా! నీలాటి తోడికోడలు దొరకడం మా అమ్మాయి పోములవలం. ఏదీ వరిపోసాని కన్నాను.

అమ్మాయిని ఎప్పుడైనా చూచుకోవచ్చును. ఇంక నగరుక తరలివెడదామా? ఆలస్య మవుతున్నది" అన్నది.

"అలాగే, పిన్నిగారూ!" అన్నది ధ్రువదేవి, చెమర్చిన కళ్ళతో

మెత్తటి ఆసనం, శ్వేతాతపత్రం అమర్చిన అందమైన అపరంజి అంబారీ మీద నూత్న వస్త్రధారి అయిన చంద్రగుప్తుని ఆసీనుణ్ణి గావించి ఊరేగింపుగా తీసుకు వెడుతున్నారు భద్రగజం మీద.

విశాలమైన రాజవీథి పొడుగునా ప్రజలు బారులు తీర్చి నిలబడి, కౌతుకంతో పెళ్ళివారిని వీక్షిస్తున్నారు— "జయీభవ, విజయీభవ" అన్న నినాదం చేస్తూ.

మేడల మీద వాతాయనాల నుండి పౌర కన్యలు, పురంధ్రీమణులు లాజలూ, పుష్పాలూ ఆశీర్వాద సూచకంగా పెళ్ళికొడుకు మీద పడేట్టుగా విసిరి వేస్తున్నారు.

చంద్రగుప్తునిలోనూ తా నిప్పుడు పెండ్లి కొడుకు నన్న భావన ఉత్పన్నమైంది. తన వివాహ విషయంలో అతని మనసును పట్టుకున్న పాలుమారిక భద్రగజం మీద ఆసీనుడు కాగానే ఎగిరి పోయింది. కళ్ళలో వినూత్నమైన కాంతి, చురుకూ చోటు చేసుకున్నాయి.

దేవనాగ వదనంలోని రమణీయత్వమూ, రాజకీయ, ఆమె విశాలమైన నేత్రాలలో అలవోకగా గోచరిస్తున్న దర్పమూ, నేర్పరి అయిన శిల్పి ఉలితో శిల మీద మలచినట్టు ఉన్న అవయవాల పొంకమూ చూచి చంద్రగుప్తుడు తనకు భార్య కాబోతూ ఉన్న కుబేరనాగ స్వరూప లావణ్యాలను ఊహించుకో గలుగుతున్నాడు.

ఊరేగింపు దేవేంద్రభవనం లాంటి రాజప్రాసాదం సమీపానికి చేరేసరికి బారెడు ప్రొద్దెక్కింది.

చిత్ర విచిత్రమైన తోరణ పంక్తులతో రాజభవన పరిసరాలు ఎంతో రమణీయంగా అలంకృతమై ఉన్నవి.

తన వివాహం సంగతి చంద్రగుప్తునికే ఆలస్యంగా తెలిసింది కాని, ఈ శుభ ముహూర్తం ఎప్పుడో నిశ్చయమై ఇంతమందికీ ఆహ్వానాలుకూడా ఎప్పుడో వెళ్ళిన విషయం అతనికి తెలియదు.

సంగీత సభలతో, నృత్య ప్రదర్శనలతో వివాహం ఎంతో వైభవంగా జరిగింది.

గణపతి నాగేంద్రుడు ఆహూతులందరికీ సముచితమైన విధంగా విడుదులూ, విందులూ ఏర్పాటు చేయించాడు.

మరునటి రోజు సాయంత్రం సముద్రగుప్త మహారాజ అధ్యక్షతను సభ ఏర్పాటు గావించబడింది. వివాహానికి వచ్చిన రాజప్రతినిధులూ, సామంతరాజులూ ఆ సభకు ఆహూతులైనారు.

భద్రాసనం పైన సముద్రగుప్త మహారాజు, అతని కుడి వైపున సింహాసనాలపైన గణపతి నాగేంద్రుడు, దేవనాగ; ఎడమ వైపున రామగుప్తుడు, ధ్రువదేవి; వారి పక్కను సూతన వధూవరులు చంద్రగుప్తుడు, కుబేరనాగ ఆసీనులైనారు. సామంతరాజులకూ, రాజప్రతినిధులకూ తగిన విధంగా ఆసనాలు నియోగించాడు. ఆ విధంగానే మంత్రులకు, సేనాపతులు మొదలైన అధికారులకుకూడా.

ఈ సభ ఏర్పాటు ముఖ్యోద్దేశం వివాహానికి వచ్చిన సామంతరాజులనూ, రాజప్రతినిధులనూ తగిన విధంగా సత్కరించడమే. రామగుప్తుని వివాహ సందర్భంలో సింహాసేనుడు తప్ప తక్కిన వారందరూ వచ్చారు. అప్పుడూ అందరినీ యథోచితంగా సత్కరించడం జరిగింది కాని, శుభ సభ మాత్రం ఏర్పాటు కాలేదు.

అందరూ ఆసీనులైన తరవాత రాజపురోహితుడూ, ఆయన అనుచరులూ స్వస్తి ప్రవచనాలు చదివారు.

అనంతరం శిఖరస్వామి లేచి, సభాసదులను ఉచిత సంబోధన చేస్తూ సముద్రగుప్త మహారాజుఉద్దేశాన్నివివరించి చెప్పాడు. తన ఆహ్వానాలను మన్నించి వారందరూ వివాహానికి వచ్చినందుకు మహారాజుగారికి మహానందంగా ఉన్నదనీ, ఈ సత్సంబంధమూ, సుహృద్భావమూ అందరిలో కలకాలం ఇదే విధంగా ఉండాలని మహారాజుగారు వాంఛిస్తున్నారనీ, మహారాజుగారు అందరికీ తమ ఆనందాన్ని తెలుపుకోవడానికే ఈ సభ ఏర్పాటు చేయబడిందని చెప్పారు.

"సముద్రగుప్త మహారాజులకూ జై" అన్న నినాదంతో సభాభవనం ప్రతిధ్వనించింది.

తరవాత మహారాజు అనుజ్ఞపైన శిఖరస్వామి రామగుప్తుని, ధ్రువదేవినీ భావి మగధ సామ్రాజ్యంపట్టుగా సామ్రాజ్ఞిగా సభా సదులకు పరిచయం చేసి, "ఇందుకు మీ అభ్యంతరం ఏదైనా ఉంటే ఇప్పుడే తెలియపరచ వలసింది" అని కోరాడు.

అందరూ హర్షధ్వానాలతో తమ అంగీకారాన్ని తెలియపరిచారు. చంద్రగుప్తుడు తన ఎదుట వంక్తిలో మొదట ఆసీనుడైన సింహాసేనుని చాలాసేపుగా గమనిస్తున్నాడు. అందరి ముఖాలలో ఉన్న ప్రశాంతత అతని ముఖంలో గోచరించడం లేదు. రామగుప్తుని విషయంలో అతడు హర్షాన్ని ప్రకటించనుకూడా లేదు. ఈ సంగతి ఎవరూ గమనించినట్టు లేదు. చంద్రగుప్తుడు మరో విషయంకూడా స్పష్టంగా గమనించాడు. సింహాసేనుని దృష్టి అంతా ధ్రువదేవి మీదనే ఉన్నట్టు.

చంద్రగుప్తుడు పక్కకు తిరిగి ధ్రువదేవి వంక చూశాడు. ఆమె తల దించుకుని కూర్చుని ఉన్నది. అన్న రామగుప్తుడు మాత్రం అప్పుడే తాను సార్వభౌముడు అయిపోయినట్టు ముఖం మీద విచిత్రమైన నవ్వు తెచ్చి పెట్టుకుని సభాసదులను పరికిస్తున్నాడు. అతడు సింహాసేనుని వాలకం చూచి ఉంటే ఏమి చేసేవాడో కాని, తనకు మాత్రం సింహాసేనుని మీదకు ఒక్క దూకుదూకి అతణ్ణి పాతమార్చాలని ఉన్నది. కాని, ఇది విందు సభ—తమ ఏ విధంగానూ తొందరపడరాని వీలులేదు.

శిఖరస్వామి చంద్రగుప్తునీ, కుబేరనాగనూ సభాసదులకు పరిచయం చేసి, మహారాజుగారు చంద్రగుప్తుని పశ్చిమ రాజ్యాలకు రాజప్రతినిధిగా నియుక్తుణ్ణి చేయదలిచారనీ, అతను ఏ నగరంలో ఉండేదీ త్వరలో నిర్ణయించి అందరికీ తెలియపరచగలరనీ, ఈ విషయంలోనూ అందరూ తమ అభిప్రాయాన్నీ, అంగీకారాన్నీ తెలియపరచవలసిందనీ అన్నాడు.

అందరూ మళ్ళీ హర్షధ్వానాలతో తమ అంగీకారాన్ని తెలియపరిచారు.

సింహాసేనుడు తన దృష్టి ని ఇంకా ధ్రువదేవి మీద నుండి మర్మలక పోవడమూ, తన విషయంలోనూ అతడు ఉదాసీనంగా ఉండడమూ గమనించిన చంద్రగుప్తునికి రక్తం పలపల కాగుతున్నట్టు తోచింది. కాని, ఇది తొందరపడే అదను కాదని తనను తానే సంబాళించుకున్నాడు.

కొంత సేపు సంగీతమూ, కొంత సేపు నృత్యప్రదర్శనమూ, కొంతసేపు విదూషకుల వినోద కాలక్షేపమూ జరిగినవి. సామంతరాజులకూ, రాజప్రతినిధులకూ ఉచిత సన్మానం జరిగిన పిమ్మట సభ సమాప్తమైనది.

(సశేషం)

జరిగిన కథ ★

మగధ సామ్రాజ్యాధిపతి సముద్రగుప్తుడు. యువరాజు రామగుప్తుడు. రెండవ కుమారుడు చంద్రగుప్తుడు. సముద్రగుప్తుడు మృతి చెంది ఇంకా నలభైరోజులయినా కాలేదు— కౌముది మహోత్సవం యథాప్రకారం జరపమని రామగుప్తుని ఆదేశం. రామగుప్తుని ధర్మపత్ని, భావి సామ్రాజ్ఞి ధ్రువదేవిని చూస్తూ చంద్రగుప్తుడు గతం నెమరువేసుకొంటున్నాడు...గుప్తుల కులగురువు శాండిల్యమహామునివద్ద శుశ్రూష చేస్తున్న కాలంలో సాకేత రాజనందన ధ్రువదేవి ఆశ్రమానికి వచ్చి, మహాముని ఆశీస్సులందుకొన్నది. చంద్రగుప్తుని మనసు దోచుకొని వెళ్ళింది. చంద్రగుప్తుని విద్యాభ్యాసం పూర్తి అయింది. రాజకీయ కారణాల మూలంగా ధ్రువదేవి రామగుప్తుని భార్య అయింది. నాగవంశ రాజ గణపతి నాగేంద్రుని కుమార్తె కుబేరనాగతో చంద్రగుప్తుని వివాహం నిశ్చయించాడు సముద్రగుప్తుడు. శాండిల్య మహాముని, శిఖరస్వామి కూడా చంద్రగుప్తుని చిత్తక్షోభ గుర్తించారు; అనునయించారు. రాజ్యక్షేమం కోసం ధ్రువదేవిని మరిచిపొమ్మని హితవు చెప్పారు. వివాహానికి కుమారుని తీసుకొని వెళ్ళడానికి సముద్రగుప్తుడు పరివారంతో వచ్చాడు. పెండ్లికొడుకును చేయడం మొదలుకొని కార్యకలాపాలన్నీ ధ్రువదేవి స్వయంగా నిర్వహిస్తున్నది. ఇది చంద్రగుప్తునికి మరింత బాధాకరంగా పరిణమించింది.

★

ప్రాసాద ద్వార సమీపానికి రాగానే భద్రగజాన్ని కూర్చుండమన్నట్టు అంకుశంతో పొడిచాడు మావటివాడు. అది వెంటనే కూర్చున్నది.

రాజకుమారుని అలంకారాలతో అక్కడ నిలబడి ఉన్న ఒక యువకుడు భద్రగజం సమీపానికి వచ్చి చేయూత నిచ్చి, చంద్రగుప్తుడు కిందకు దిగడానికి సహాయపడ్డాడు.

"నా పేరు కుమార నాగేంద్ర. గణపతి నాగేంద్రుని తమ్ముని కుమారుణ్ణి. మీకు కాబోయే..." అని శాలీనతతో ఆగిపోయాడతను.

"శ్యాలకులా!" అని అతని మాట పూర్తి చేశాడు. చంద్రగుప్తుడు.

ఇద్దరూ నవ్వుకున్నారు.

ఆ సమయంలో పెళ్ళి కుమారునికి చెయ్యవలసిన ఉపచారాలకు కావలసిన వస్తు సముదాయంతో పరిజనం సంసిద్ధంగా ఉన్నారు.

కుమార నాగేంద్రుడు చంద్రగుప్తునికి చందన చర్చ గావించాడు. కస్తూరితో తిలకం దిద్దాడు. పన్నీరు చిలకరించాడు. మణిహారాలూ, పుష్పహారాలూ మెడలో వేశాడు. కూష్మాండం దిగదుడిచి తన పత్నుని కొడ్డీ నీలను కొడిగే అదితునాతునకక్కొంది.

అనంతరం పురంధ్రీమణులు పచ్చలు పాదిగిన పసిడి పళ్ళెంలో వసంతజలం మధ్య మాణిక్య జ్యోతులు పెట్టి పెళ్ళికుమారునికి మంగళహారతి ఇచ్చారు.

తరవాత పెళ్ళికుమారుని నుదుటిమీద నడిపిస్తూ ప్రాసారంలోనికి తీసుకువెళ్ళారు.

ఆ నాడు గోధూళి సమయంలో చంద్రగుప్తునికీ, కుబేరనాగకూ వేదోక్త ప్రకారంగా పాణిగ్రహణం అతి వైభవంగా జరిగింది.

సముద్రగుప్తుని, గణపతి నాగేంద్రుని ఆహ్వానానుపురస్కరించుకుని సాకేతరాజు, కాశీ రాజు సతీసమేతులై వివాహవేళకు వచ్చారు.

వేసాళ, వంగ, కళింగ, వేంగీ, కుంతల, చోళ, పాండ్య, కేరళ, సింహళ రాజులు లాంఛనాలతో తమ ప్రతినిధులను వివాహానికి పంపించారు. వకటక రాజైన ప్రవరసేనుడు, క్షాత్రపరాజైన సింహాసేనుడు, ఇంకా అంగ, పాంచాల కాశ్మీర, గాంధార, సౌరాష్ట్ర ప్రభృతి సామంతరాజులు స్వయంగా వివాహానికి విచ్చేసి తమ అంతస్తుకు తగినవిధంగా వధూవరులకు కానుకలు సమర్పించారు.

"ఆధారం లేకపోతే!"

- కోన శ్రీనివాసరావు

ఊరంతా నిశాదేవి ఒడిలో నిద్ర పోతున్నది. ఊరికి చివరగా ఉన్న ఇళ్ళలో ఓ పెంకుటిల్లు. ఆ ఇల్లనబడే చిన్న గదిని రెండుగా విభజిస్తూ ఓ తడికె. ఆ తడికెకు అంటించి ఏవో పాత సినిమా పోస్టర్లు. అవతలి వైపున్న చెత్తాచెదారంతో తడికెకు వాకిలి. ఎంతో నిరాడంబరంగా ఉంది ఇల్లు.

తడికెకు ఇవతలి వైపున పవారు మంచం. ధనిమీద హాకబారు వరుపు. గోడకు వేలాడుతూ అర్ధ నగ్న దృశ్యాలతో ఉన్న రెండు మూడు కాలెండర్లు.

గదిలో దీపం మసగ్గా వెలుగుతున్నది.

ఆమె మంచం మీద కూర్చుని ఉంది. మనసులో ఏదో దిగులు. చెప్పలేని ఆవేదన, అర్ధరాత్రి కావస్తున్నా ఈ రోజు ఇంతవరకూ ఒక్కరైనా రాకపోవటం చాలా బాధనిపించిం దామెకు. తెల్లవారితే రేపు! ఆ రేపు ఎలా గడుస్తుందన్నదే ఆమె బాధ! ఏ రోజు సంపాదన ఆ రోజుకే సరిపోతున్నది. ఇంక రేపటికి ఎలా మిగులుతుంది?

ఆరగంట గడిచింది. వాకిట్లో ఏదో అలికిడి! ఓసారి తల విదిల్చి వాకిట్లోకి చూసింది. గుమ్మంలో ఓ వ్యక్తి నిలబడి ఉన్నాడు. ముప్పయి అయిదేళ్ళు ఉంటాయేమో!

సిల్కు లాల్చీ, తెల్లటి పైజామాలో, మనిషి ఛాంబాగానే ఉన్నాడు. అయినా, అతనిలో అతని ముఖ కవళికల్లో ఏదో అనిర్వచనీయమైన భావం కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నది.

ఆమెకి ప్రాణం లేచొచ్చింది. వెంటనే లేచి నిలుచుని అంది "రండి, కూర్చోండి!"

అతను వచ్చి పరుపుమీద కూర్చున్నాడు. ఆమె వెళ్ళి నాలుగు ఊదు కడ్డీలు వెలిగించి గోడ చిల్లులో గుచ్చింది.

"ఎందుకని?" అడిగా డతను.

వింతగా చూసిం దామె, అరవి వైపు.

కానీ, ఏమీ మాట్లాడలేదు.

"రా. వచ్చి కూర్చో!"

"పరవాలేదు!" నిలుచునే ఉందామె.

అతను లేచి వచ్చి ఆమెని తన పక్కనే కూర్చో పెట్టుకున్నాడు.

"నీ పేరేమిటి?" ప్రశ్నించా డామెను.

వెంటనే అతని కళ్ళలోకి సూటిగా చూసిం దామె.

"పిడికెడు ఉప్పులో ఓ ఉప్పుకల్లును చూపించి నీ పేరేమిటి అని అడిగితే, అది నీ చెబుతుంది చెప్పండి?"

ఆమెలో ఎటువంటి భావాలూ వ్యక్తం కాలేదు.

"అంటే?" అర్థం కాలేదు అతనికి ఆమె మాటలు.

"ఎవర్నైనా పేరు ఎందుకు పెట్టుకుంటారు?" ఎదురు ప్రశ్న వేసిం దామె.

"సంఘంలో 'ఫలానా వ్యక్తి' అని గుర్తింపు కోసం!"

"అలాంటి సంఘంలోనే ఆ వ్యక్తి లేనప్పుడు మరి పేరెందుకు?"

"అంటే నీ పేరు చెప్పటం ఇష్టంలేదా?"

"ఇష్టా, అయిష్ట మనేవి మనుషులకు!"

"మీరు మనుషులు కారనా నీ ఉద్దేశ్యం!"

"మనుషుల మని అనేందుకు మీకు లేకపోయినా, మనుషుల మని చెప్పుకోవడానికు మా కైనా ఉండాలి!"

"ఇంతకీ. . . ఇష్టం లేదన్నమాట!"

"ఇష్టం సంగతి కాదు; అవసరం లేదు." ఆమె అంది.

"నాకు అవసర మనిపించవచ్చుగా!"

ఒక్క క్షణం అతని కళ్ళలోకి సూటిగా చూసింది.

"సావిత్రి!"

"చాలా బాగుంది పేరు!"

"వ్యంగ్యమా!"

"వ్యంగ్యం చేయవలసిన అవసరం నాకు లేదు."

కాసేపు ఇద్దరూ మాట్లాడలేదు. ఆమె తెల్లటి నుదుటి మీద చెమట బిందువులు! ముక్కు లు సీక్కు పోయాయి. నుదుటి మీద బొట్టు లేదు. అయినా, అందంగానే కనిపిస్తున్న దామె! కట్టుకున్న నేత చీర కొంగుతో ముఖాన్ని తుడుచుకుంది.

ఆమె వైపే చూస్తూ అన్నా డతను—

"నీకు పెళ్ళి అయిందా?"

ఒక్క క్షణం నివ్వెరపోయిం దామె. దాని నుండి తేరుకుని, "గోడవైపు చూడండి!" అన్నది.

తల తిప్పి గోడ వంక చూశాడతను. గోడకు తగిలించి ఉన్న ఫోటోలో ఆమె పక్కనే ఎవరో ఒకతను ఉన్నాడు. బహుశః భర్త కాబోలు!

"ఎక్కడున్నా డిప్పుడు?"

"గాలివటం నుండి దారం తెగిపోయింది!"

"నిన్ను వదిలేసి వెళ్ళాడా?"

"అలా ఎందు కనుకోవాలి?"

"మరి విడిపోటానికి కారణం?"

"ఏదో ఒక బలమైన శక్తి లేకుండానే దారం నుండి గాలివటం తెగుతుందా?"

"శక్తా! ఏమిటది? "

"మృత్యువు!" ఆమె గొంతు జీర పోయింది.

ఆమె కళ్ళల్లో నీళ్ళు! కాని, అవేమీ గమనించ లే దతను. "అంటే, ఇప్పుడు నువ్వు. . ."

ఆమె ఏమీ మాట్లాడలేదు. అతని ధోరణి ఆమెకు అర్థం కాలేదు.

ఉన్నట్లుండి అన్న దామె— "మీకు వేరే పనేమీ లేదా?"

"పనుంటే ఇక్కడి కెందుకొస్తాను? ఏం, వేరే ప్రోగ్రాముందా, నీకు!"

"ఆహా, కాదు! ఇద్దరికీ కాలం వృథా అవుతున్నదే అని!"

"వృథా అవుతున్నదనే ఎందుకనుకోవాలి? సద్వినియోగం అవుతున్నదనుకోవచ్చుగా!' నవ్వుతూ అన్నాడు.

ఆమె ఊరుకుండి పోయింది.

కాసేపాగి అన్నా డతను, గుర్తు చేస్తూ.

"నా ప్రశ్నకు సమాధానం చెప్పనే లేదు."

"అవును. నేను విధవనే!" ధైర్యంగా అన్న దామె.

"ఈ వృత్తి ఎందుకు స్వీకరించవలసి వచ్చింది?"

"తెగిపోయిన గాలివటం ఏదో ఆధారం చూసుకోవాలిగా! లేకపోతే ఏ ఆగాధంలోనో, ఏ నడి సముద్రంలోనో పడిపోక తప్పుతుందా?"

"ఆధారం కోసం ఇంత నీచమైన వృత్తినే ఎందుకు ఎన్నుకోవాలి?"

"గాలివటం ఏ అశోకవృక్షం మీదనో పడాలనే అనుకున్నా, అది వెళ్ళి ఏ ముళ్ళపొదమీదో పడబట్టగా!"

"కారణం?"

"పరిస్థితులు!"

"అంటే?"

"సంఘం పరువుగా బతకనిస్తేగా?"

"నీ ఒక్కదానివి బతకటానికి ఇంతకంటే వేరే పనే దొరకలేదా?"

"ఒక్కదాన్నే అని ఎలా అనుకున్నారు?"

"నీకు పిల్లలా?"

"లేరని ఎందు కనుకోవాలి?"

"ఒక్కసారి చూపుతావా?"

"అవసరం! చూపి ప్రయోజనం లేదు!" నిష్కర్షగా అం దామె.

"అలా ఎందుకనుకోవాలి?"

"తప్పదా?"

"అవును!"

లోపలికి వెళ్ళి కూతుర్ని తీసుకు వచ్చింది. నాలుగేళ్ళుంటాయి! తెల్లగా ఉన్నా, పీలగా ఉంది. అయినా, ముద్దు వస్తున్నది.

కాస్సేపాలోచిస్తూ కూర్చున్నాడు.

లేచి నిలబడి వెళ్ళిపోతూ పది రూపాయల నోటు అందించాడు.

ఆమె తీసుకోలేదు.

"తీసుకో!"

"ఉత్త పుణ్యానికి తీసుకోవటం అలవాటు లేదు!"

"నీ కాలమంతా వృథా చేశాను!"

"పరవాలేదు."

"తీసుకోకపోతే నీకు వేరే ఆధారం లేదుగా!"

"దయ చూపిస్తున్నారా?"

"కాదు, నా తృప్తి కోసం."

తీసుకోక తప్పలే దామెకి.

అతను వెళ్ళిపోయాడు.

* * *

రెండు రోజులు తరవాత—

మళ్ళీ వచ్చా డతను! వస్తూనే అన్నాడు—

"భేష్! నువ్వు నాకు నచ్చావు."

"కబుర్లు చెప్పుకోవటానికా?"

"లేదు! నువ్వు నాకు బాగా నచ్చావు."

"ఈ ఒక్క రాత్రికేగా!"

"కాదు—జీవితాంతం!"

"అంటే?!"

"నిన్ను పెళ్ళి చేసుకుంటాను!"

ఒక్క క్షణం నివ్వెర పోయిం దామె.

"హాస్య మాడుతున్నారా?"

"కాదు, నిజం!"

"నేను నమ్మలేను!"

"ఇందులో నా స్వార్థం లేకపోలేదు!"

"అంటే?"

"నువ్వు తెగిపోయిన గాలివటానివి. నేను తెగిపోయిన దారాన్ని. నా నుండి నా గాలివట దూరమై సంవత్సర మైంది. నాకు ఇద్దరు పిల్లలు. నా కోసం కాకపోయినా, కనీసం పిల్లల కోసమైనా మరో గాలి వటంలతో ముడేసుకోక తప్పేట్లు లేదు. కొత్త గాలివటాలన్నీ కొత్త దారంతోనే ముడేసుకోవాలని ఎన్నో కలలు కంటూంటాయి. వాటి కలల్ని నమ్ము చేసి నాతో ముడేసుకోవడం నా కిష్టం లేదు. అందుకే వా లాగే తెగిపోయిన గాలివటం తోటే ముడేసుకోవాలని నా ఊహ. ఆ అన్వేషణ లోనే తిరుగుతున్నాను. 'అలాంటి వాళ్ళే కావాలంటే బయట సంఘంలో ఎంత మంది లేరు, వాళ్ళని ఉద్ధరించకూడదూ!' అనచ్చు నువ్వు. కాని, నువ్వు కావాలని ఈ వృత్తి స్వీకరించ లేదు. పరిస్థితుల ప్రభావం నిన్నలా వురికొల్పింది. ఇన్నాళ్ళూ ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను. నువ్వు యోగ్యురాలి వనిపించావు. అందుకే ఈ నిర్ణయం ఎంతో సమంజసమనే నా ఉద్దేశ్యం!"

"అసంభవం!"

"ఎందుకని?"

"నిర్ణయం రెండు వైపులా ఒకే విధంగా ఉండాలి!"

"నీ కిష్టం లేదా?"

"మలిన పడిన పూవును తీసుకు వెళ్ళి, దేవుడి పాదాల ముందు పెట్టే కుసంస్కారం నాకు!"

"మాలిన్యం శరీరానికే కాని, ఆత్మకు కాదు!"

"ఆత్మ! ఎక్కడుంది ఆత్మ? ఏ వాడో వచ్చిపోయింది!"

"కాదు. నువ్వు ఆత్మవంచన చేసుకుంటున్నావు!"

"ఆత్మే లేనప్పుడు, ఆత్మ వంచనకు తావేలేదు!"

"నువ్వు చాలా మొండిదానివి!" విసుగ్గా అన్నాడు.

"తెలుసుకున్నారు! సంతోషం!" విరక్తిగా అందామె.

"నువ్వు అంగీకరించటం వల్ల, నీకూ ఉపయోగం ఉంది!"

ప్రశ్నార్థకంగా చూసిం దామె, అతని వైపు.

"అవును. నువ్వు నా పిల్లలకు తల్లి వైనట్లే, నేను నీ కూతురికి తండ్రి నవుతాను!"

"జాలి చూపిస్తున్నారా!"

"లేదు, స్వార్థం!"

పది రూపాయల నోట్లు పది ఆమె కందిస్తూ అన్నారు—

"మళ్ళీ వారం తరవాత వస్తాను. బాగా ఆలోచించుకో. నీ నిర్ణయం చెప్పు! నీ నోటితో చెప్పలేకపోతే, పరిగ్గా ఇదే చెప్పుకి వాకిలి తీసి ఉంచు, నువ్వు అంగీకరిస్తే! లేదూ, వాకిలి మూసేయ్! నువ్వెలాంటి నిర్ణయం తీసుకున్నా నా కేమీ బాధ కలిగించదు!"

ఆమె అతని కళ్ళలోకి సూటిగా చూసిం ది.

వాటిల్లో ఒక్క పది రూపాయల నోటు మాత్రం తీసుకుంది.

"తీసుకో!"

"నా రేటు పది రూపాయలే!"

"అలాగైతే ఈ వారం రోజులూ మరెవర్నీ రానీయకు!"

మళ్ళీ అతని మొహంలోకి చూసిం దామె. మరో ఆరు నోట్లు తీసుకుంది.

అతనిలో ఉత్సాహం! హుషారుగా వెళ్ళిపోయాడు.

వారం రోజులు గడిచి పోయాయి. అంతవరకూ బాగా ఆ